క్లుప్తంగా

మొక్కల పెంపకానికి ప్రాధాన్యత

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం పనుల ద్వారా మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీవో శోభాదేవి అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని చెరువుగట్లు, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటే ప్రక్రియ చేపడతామని.. వీటిని సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సక్రమంగా భూ సర్వే

ఎచ్చెర్ల: భూముల సర్వేను సిబ్బంది సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ సత్యన్నారాయణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వే సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న సర్వేయర్లు తమ పనిని మరింత మెరుగుపర్చుకోవాలన్నారు.

చినరావుపల్లిలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లి గ్రామంలో ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య సిబ్బంది సుగర్, బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జీరు రమ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: కొర్లాం పరిధిలోని కొమరవానిపేట పంచాయతీకి చెందిన మైలపల్లి చలం, మైలపల్లి అమ్మోరమ్మలు ఇటీవల చనిపోయారు. దీంతో వీరి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున శనివారం అందించారు. కొమరవానిపేట సర్పంచ్ వారాధి రవికుమార్ చేతుల మీదుగా సాయాన్ని పంపిణీ చేయగా.. పంచాయతీ కార్యదర్శి వి.మహేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.


త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో కుమార్ పట్నాయక్

ఎచ్చెర్ల క్యాంపస్: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులంతా త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ అన్నారు. ముద్దాడ గ్రామ సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉరిటి రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. స్థలం మంజూరైన లబ్ధిదారులంతా విధిగా నిర్మాణాలు ప్రారంభిస్తే.. ప్రభుత్వ నిబంధనల మేరకు బిల్లులు రూపేణా రూ. 1.80 లక్షలు అందజేస్తామని వివరించారు. గ్రామం యూనిట్‌గా నవరత్న పథకాలు అర్హులకు చేరువ చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ ముద్దాడ శంకరరావు, గ్రామ కార్యదర్శి సుమలత, వైఎస్సార్‌సీపీ నాయకులు బెండు రామారావు, లింగాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

లావేరు: ఉపాధి వేతనదారులు రోజుకు కచ్చితంగా ఆరు గంటలు పనిచేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు జీవీ చిట్టిరాజు అన్నారు. పెదకొత్తపల్లి గ్రామంలోని అమృత్ సరోవర్ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. గరిష్ట వేతనం పొందాలంటే రెండు పూటలా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. ఏపీడీ శైలజ, ఏపీవో సత్యవతి, ఈసీ లెనిన్‌బాబు ఉన్నారు.

ఎన్నికల సమరానికి జగనన్న సైన్యం సిద్ధం

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, పార్టీ పరిశీలకుడు నాయుడుబాబు
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం



గృహసారథులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, పరిశీలకుడు నాయుడుబాబు

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు మద్దతుగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల రూపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతిపెద్ద సైన్యాన్ని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు అన్నారు. పైడిభీమవరంలో జె.ఆర్.పురం-1, 2, రణస్థలం-1, 2, కొచ్చెర్ల, పాతర్లపల్లి, కొవ్వాడ, దేరసాం, కోష్ట, చిల్లపేటరాజాం, మరువాడ, పిషిని, బంటుపల్లి, కొందములగాం సచివాలయల పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా రాష్ట్రంలో ఖర్చు చేసినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారని.. అయితే ఏ పనులు చేశారో చెప్పేందుకు వారిదగ్గర ఒక్క రూపాయికి కూడా ఆధారం లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో రెండు లక్షల కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల రూపంలో పేదలకు నేరుగా వారి అకౌంట్లలో జమ చేశామన్నారు. దీనికి పేదవాడి ముఖంలో చిరునవ్వే సాక్ష్యంగా నిలిచిందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులను వివరించాలన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పార్టీలకతీతంగా.. రూపాయి కూడా లంచం లేకుండా వలంటీర్లతో ఒకటో తేదీనే పింఛన్, ఇంటి వద్దకే రేషన్ అందజేయడం వంటి విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. లావేరులో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ కార్యకర్తలే తమకు ఓటు వేయరని, అందుకే చంద్రబాబుతో పొత్తులకు వెళ్తానని బహిరంగంగా ప్రకటించారన్నారు. సీఎంగా పోటీ చేయని వ్యక్తికి ఓటు వేస్తే వృథా అయిపోతుందన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రజల కష్టాలు తీర్చే వ్యక్తికి ఓటు వేయాలే తప్పా దోచుకోవడం.. దాచుకోవడం.. వెన్నుపోటు పొడవడంలో ఆరితేరిన టీడీపీకి ఓటు వేయకూడదన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మనకు సచివాలయ కన్వీనర్లుగా, గృహసారథులుగా, వలంటీర్లుగా సముచిత స్థానం లభించిందని చెప్పారు. అందరం సమన్వయంగా పని చేస్తూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసేలా జగనన్న పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం 'నా నమ్మకం నువ్వే జగన్' కిట్లను కన్వీనర్లు, గృహసారథులకు పంపిణీ చేశారు. తొలుత జగనన్న సచివాలయ కన్వీనర్ల విధులపై తెరపై దృశ్యమాలిక వేసి వివరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం బీసీ సెల్ కార్యదర్శి ఎం.సత్యనారయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళ అధ్యక్షురాలు గురాన మానస, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, లంకలపల్లి ప్రసాద్, మైలపల్లి కామరాజు, పైడి శ్రీనివాసరావు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



నా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినాదాలు చేస్తున్న కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు

ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలు

- జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అనూరాధ



తాళ్లవలసలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అనూరాధ

లావేరు: జగనన్న కాలనీల్లో ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి అనూరాధ అన్నారు. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీల్లో స్థలం వచ్చిన లబ్ధిదారులంతా ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తాళ్లవలస, బెజ్జిపురం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో అధికారులు శనివారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా అనూరాధ మాట్లాడుతూ.. ఉగాది రోజున సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇంటి నిర్మాణదారులకు ఇసుక, సిమెంటు, ఐరన్ అందజేయడంతోపాటు బిల్లులు సకాలంలో మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, హౌసింగ్ మండల ఏఈ కె.అప్పలనాయుడు, వర్కు ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈలు ఎల్.అప్పన్న, బి.శివకుమార్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైకేపీ మండల ఏపీఎం ఎం.మాధవీలత, ఏపీవో సత్యవతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో ప్రథమ స్థానం



వెంకటరమణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణమూర్తి తదితరులు

శ్రీకాకుళం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 30న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో శాస్త్రులపేట (అంపోలు)లోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థి వజ్జ వెంకటరమణ ప్రథమస్థానంలో నిలిచాడు. స్కూల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జల్లు లక్ష్మణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న నార్తన్ సర్కార్స్ యాజమాన్యం ఆహార ప్రియులకు వినోదం అందించేలా నిర్ణయం తీసుకున్నారు. రోజూ సాయంత్రం వేళ నృత్య, ఇతర ప్రత్యేక కార్యక్రమాలను అందించాలని యోచిస్తూ ఇందులో భాగంగా ఔత్సాహిక కళాకారులకు అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. గిటార్, తబళా, డ్రమ్స్, సంగీతం, నృత్యం, మ్యూజిషియన్ తదితర రంగాల్లో ప్రత్యేకత కనపర్చే కళాకారులను ప్రోత్సహించేందకు వేదికను ఇచ్చి వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయనున్నారు. ఆసక్తి ఉన్న కళాకారులు తమను సంప్రదించాలని యాజమాన్యం కోరింది. ఇందులో భాగంగా ఈనెల 5వ తేదీన రివైవ్ బ్యాండ్ నుంచి ప్రముఖ గాయకుల ద్వారా సంగీతాన్ని అందిస్తున్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లావేరు: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో లావేరు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తొమ్మిది మంది విద్యార్థులు రజత, కాంస్య పతకాలు సాధించినట్టు హెచ్‌ఎం పట్నాన రాజారావు తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. శిక్షణ ఇచ్చిన పీడీ కె.రవికుమార్‌ను సన్మానించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో గత నెల 28 నుంచి 30వతేదీ తేదీ వరకూ 66వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు జరిగాయన్నారు. అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లకు ప్రతినిధ్యం వహించిన తమ పాఠశాలకు చెందిన ఎం.అజయ్, ఎం.కిరణ్, పి.తులసీరావు, యు.మనోజ్‌కుమార్, ఎన్.గుణశేఖర్‌లు రజత పతకాలు, బాలికల విభాగంలో ఎస్.ప్రవల్లిక, కె.శిరీష, వి.దివ్యశ్రీ, కె.నందినిలు కాంస్య పతకాలు సాధించారన్నారు. వీరిలో అత్యంత ప్రతిభ కనపరిచిన టెన్త్ ఇంగ్లిషు మీడియం విద్యార్థులు ఎం.అజయ్, ఎస్.ప్రవల్లిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

క్యాన్సర్‌ను తరిమికొట్టాలి



శ్రీకాకుళం అర్బన్: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్: ర్యాలీ చేస్తున్న డెంటల్ కళాశాల విద్యార్థులు



రణస్థలం: సంచాంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



లావేరు: కొత్తరౌతుపేటలో అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ వైద్య సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: మనిషి ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తూ, నిండు ప్రాణాలు బలిగొంటున్న క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నాశనం చేసేందుకు సమాజంలో అన్ని వర్గాలు కలిసికట్టుగా ముందుకు రావాలని స్వచ్ఛంద సేవకులు పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జెమ్స్ ఆస్పత్రి క్యాన్సర్ విభాగం, స్టార్ వాకర్స్ క్లబ్, రోటరీక్లబ్‌లు సంయుక్త నిర్వహణలో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ఎస్.రవీంద్ర మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య నియమాలను పాటించడం, నిత్యం వ్యాయామం చేస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో క్యాన్సర్ వ్యాధి నివారణకు జెమ్స్ ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, రోటరీ ప్రతినిధి, ప్రముఖ సామాజికవేత్త మంత్రి వెంకటస్వామి, జెమ్స్ మెడికల్ కాలేజీ ప్రతినిధులు డాక్టర్ డి.ప్రవీణ్, ఆబోతుల రామ్మోహన్‌రావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఐకె.రావు, ఊన్న నాగభూషన్, కిల్లారి రవి, జామి రాధాకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం రూరల్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏడురోడ్ల జంక్షన్ నుంచి డేఅండ్‌నైట్ కూడలి వరకూ పాత్రునివలస పరిధిలోని శ్రీసాయి డెంటల్ కళాశాల రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. పొగాకు, గుట్కా నమలడం వల్ల చాలామంది క్యాన్సర్ బారిన పడతారన్నారు.

క్యాన్సర్ అంటు వ్యాధి కాదు

రణస్థలం: క్యాన్సర్ అంటువ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులను దూరంగా పెట్టనవసరం లేదని నైస్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మేఘనాథ్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నైస్ ఫౌండేషన్, డాక్టర్ రెడ్డీస్ సంయుక్తంగా వరిసాం, వెల్లురాయి, వల్లభరావుపేట, గిరివానిపాలెం, సంచాం, పతివాడపాలెం గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి నివారణపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులకు మనోధైర్యం ఇవ్వాలని, ప్రస్తుతం అత్యాధునిక సదుపాయాలతో వ్యాధి నివారణకు చికిత్స అందుబాటులో వచ్చిందన్నారు. క్యాన్సర్ వ్యాధికి కారణమైన పొగాకు, మద్యం, వాడిన నూనెలు మళ్లీ వాడటం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల వచ్చే అవకాశాలు ఎక్కువన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, నైస్ ఫౌండేషన్ సిబ్బంది ఉన్నారు.

లావేరులో..

లావేరు: రాయిలింగారిపేట, కొత్తరౌతుపేట, చినరొంపివలస, తామాడ, బొంతుపేట గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి రావడానికి కారణాలు, వస్తే నివారణ ఎలా, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి నైస్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది తెలియజేశారు.

అది ప్రమాదమే..

- ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు, ఎస్సై లక్ష్మణరావు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారని.. అతనిపై హత్యాయత్నానికి పాల్పడ్డ కుట్రకోణం ఏమీ లేదని ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి వెంకటేష్ ద్విచక్ర వాహనాన్ని నగరంలోని 80 అడుగుల రోడ్డులో కారు ఢీకొందన్నారు. వెంకటేష్ టీడీపీ కార్యాలయానికి వెళ్లేందుకు గొలివి నర్సునాయుడుతో కలిసి వెళ్తుండగా ఆనంద కల్యాణ మండపం సమీపానికి వచ్చేసరికి.. వాంబే కాలనీ నుంచి వస్తున్న గుర్తు తెలియని హోండా వెన్యూ కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుందన్నారు. రోడ్డు ప్రమాదంలో ఎటువంటి కుట్రకోణం లేదని తమ విచారణలో తేలిందని ట్రాఫిక్ డీఎస్పీ వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన పాకల కిశోర్ (24) ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కొచ్చి శనివారం లొంగిపోయినట్టు పేర్కొన్నారు. యూటర్న్ తీసుకుంటుండగా ప్రమాదం జరిగిందని కారు డ్రైవర్ చెప్పినట్టు చెప్పారు. అతను చెప్పిన వివరాల ప్రకారం సంఘటనాస్థలికి వెళ్లి విచారణ చేశామన్నారు. సీసీ ఫుటేజీ దృశ్యాలు సరిపోయాయన్నారు. ఎస్పీ కార్యాలయానికి టీడీపీ నాయకులు వెళ్లి కుట్రకోణం ఉందని వినతిపత్రం అందించారని చెప్పారు. కాగా వెంకటేష్ కుమారుడు డేవిడ్ ఫిర్యాదులో మాత్రం తన తండ్రి వెంకటేష్ ఒక్కరే ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనంపై ఉన్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పనిభారం తగ్గించాలి



దీక్ష చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో ఏకపక్షంగా కిలోమీటర్లు పెంచి ఉద్యోగులపై పని భారం పెంచారని, దీనిని వెంటనే తగ్గించాలని జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వైఎస్సార్‌ఈఏ ప్రతినిధి ఎస్ఎన్ కుమార్ మాట్లాడుతూ.. ఆరునెలలుగా వెట్టిచాకిరీ చేయించుకొని అలవెన్స్‌లు మాత్రం చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులతో బలవంతంగా ఓటీలు చేయిస్తున్నారని, వీటిని వెంటనే రద్దు చేసి సింగిల్ డ్యూటీలుగా 8 గంటల పనివిధానాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఈయూ ప్రతినిధి కె.బాబూరావు మాట్లాడారు. దీక్షలో జేఏసీ ప్రతినిధులు ఆర్.వసంతరావు, ఎస్.రమణ, పి.రంగారావు, ఎన్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న విజయభాస్కర్

రణస్థలం: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం, నాణ్యమైన దిగుబడి పొందుటకు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించేలా రైతుల్లో అవగాహన తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి డి.విజయభాస్కర్ వీఎఫ్‌ఏలకు సూచించారు. రణస్థలం-1 గ్రామ రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంపై గ్రామీణ వ్యవసాయ అసిస్టెంట్‌లకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలను రైతుల పండించేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు.

'వాణీజయరామ్ మంచి మనిషి'



వాణిజయరాంతో రమేష్

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ గాయని వాణీజయరాం మంచి మనిషని, చక్కనైన గాత్రంతో ఎన్నో మధురగీతాలను పలికించారని గాయకుడు భారతి రమేష్ అన్నారు. ఆమె మృతికి సంతాపం తెలియజేశారు. వాణీజయరాంతో ఉన్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. 1996లో షిర్డీ సాయిబాబా వారిపాటల ఆల్బమ్‌ను తాను రూపొందించగా.. అందులో ఆమె నాలుగు పాటలు పాడినట్టు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



నారాయణప్పుడు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బాతువ గ్రామ మాజీ సర్పంచ్ ముల్లు నారాయణప్పడు (70) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈయన నాలుగుసార్లు సర్పంచ్‌గా, మూడుసార్లు సహకార సంఘం చైర్మన్‌గా పని చేశారు. నారాయణప్పుడు మరణ వార్త తెలియగానే ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల నాయకులు మీసాల వెంకటరమణ, బూరాడ వెంకటరమణ, నక్క ప్రసాదరావు, డోల వెంకటరమణ, అబోతుల జగన్నాథం, మక్క వెంకటిసాయి, బూటు అప్పారావు, పల్లేటి సన్యాసిరావు,చిత్తిరి మోహన్ తదితరులు బాతువ చేరుకున్నారు. నారాయణప్పడు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

హెల్మెట్ రక్షణ కవచం



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సోమశేఖర్



జి.సిగడాం: వాహనదారులకు అవగహన కల్పిస్తున్న ఎస్సై రామారావు

శ్రీకాకుళం క్రైమ్: ద్విచక్ర వాహనం నడిపే వారి ప్రాణానికి హెల్మెట్ రక్షణ కవచం వంటిదని ట్రాఫిక్ ఎస్సై సోమశేఖర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో హెల్మెట్ ధారణపై వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని ఎస్సై సామంతుల రామారావు అన్నారు. మండల కేంద్రం జి.సిగడాంలో ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వాడకంపై అవగహన కల్పించారు.

రంగస్థల కళాకారుల సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య 20వ నెల సమావేశం శనివారం జరిగింది. ముందుగా ఇటీవల మృతి చెందిన ప్రముఖ గాయని వాణిజయరాం, సినీ దర్శకులు కె.విశ్వనాథ్‌లకు సమాఖ్య సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సమాఖ్య ప్రతినిధి డాక్టర్ మజ్జి త్రినాథబాబు సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన భద్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిసుంటే నాటికను ప్రదర్శించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఎల్.నందికేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో పొట్నూరు వెంకటరావు, నాంచారయ్య, గొర్లె రామారావు, పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, బి.ఎ.మోహనరావు, బి.రామచంద్రదేవ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రణస్థలం: అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ రణస్థలం పీవో సీహెచ్ ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెంకటరావుపేట (బీసీ-బీ), కుమ్మరిపేట (బీసీ-ఏ), లావేరు మండలంలోని కొండకుంకాం (ఎస్సీ) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళలు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా రణస్థలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుల, వివాహ, స్థానికతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాలన్నారు.